## ఇది ఏమిటి?

సాధారణ ప్రజలు తమ హక్కుల కోసం, స్వేచ్ఛల కోసం, న్యాయం కోసం అహింసాయుతంగా పోరాడే పద్ధతి ప్రజా ప్రతిఘటన. ప్రజలు ఈ ప్రతిఘటన పోరాడాల్లో విభిన్నమైన ఎత్తుగడలు పాటిస్తారు. స్ట్రయికులు, హర్తాళ్ళు, బాయ్ కాట్, నిరసన ప్రదర్శన తదితర పద్ధతుల్లో పోరాడుతారు. ఈ పోరాటాల ద్వారా విస్తృతస్థాయి సామాజిక, రాజకీయ, ఆర్థిక మార్పులు సాధించే ప్రయత్నాలు చేస్తారు. ప్రపంచంలో ప్రజా ప్రతిఘటన పోరాటాలను వివిధ పేర్లతో పిలువడం జరుగుతోంది. అహింసాయుత పోరాటాలు, ప్రత్యక్ష చర్య, ప్రజాశక్తి, రాజకీయ అసమ్మతి, ప్రజాసమీకరణ తదితర పేర్లతో పిలుస్తున్నారు. ఏ పేరుతో పిలిచినా మౌలికంగా ప్రజా ప్రతిఘటన రూపం ఒక్కటే.

ప్రజా ప్రతిఘటన ఉద్యమాలు చాలా శక్తివంతమైనవి. ఎందుకంటే అణిచివేతకు వ్యతిరేకంగా, స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన సమాజస్థాపన కోసం అణిచివేతల వ్యవస్థకు విధేయులైన వారిపై చర్యల్లో ప్రజలు భారిసంఖ్యలో పాలుపంచుకుంటారు. దౌర్జన్య పాలకుల పట్ల విధేయతను ప్రజలు మానుకుంటే ఆ నిరంకుశ వ్యవస్థ కొనసాగడం చాలా కష్టమవుతుంది. పెద్దసంఖ్యలో ప్రజలు అవిధేయతకు పూనుకుంటే ఆ వ్యవస్థ నిలబడదు. కుప్పకూలడమో, మార్పును స్వీకరించడమో జరగాలి. ప్రజాప్రతిఘటనను వ్యతిరేకించేవారు సాయుధులై, వనరులు సమృద్ధిగా కలిగిన వారైనప్పటికీ నిరంతరంగా కొనసాగే ప్రజాందోళనను, వ్యూహాత్మకంగా, విస్తృతస్థాయి అహింసాయుత సహాయనిరాకరణోద్యమాన్ని తట్టుకుని నిలబడడం సాధ్యం కాదు.

అందువల్లనే చాలా ప్రజా ప్రతిఘటనోద్యమాలు విభిన్న దౌర్జన్యభరితమైన వ్యవస్థలపై విజయాలు సాధించాయి. గత శతాబ్దంలోని ప్రతి దశాబ్దంలోను ఆరు ఖండాల్లో అహింసాయుత వ్యూహాలతో పోరాడిన ప్రజా ఉద్యమాలు అహింసాయుత వ్యూహాలతో నిరంకుశ వ్యవస్థలను పెరికిపారేశాయి. సైనిక దురాక్రమణలను జయప్రదంగా నిరోధించాయి. ఆయా సమాజాల్లో న్యాయం, స్వేచ్ఛలను సాధించుకోగలిగాయి. ఉదాహరణకు, దక్షిణాఫ్రికాలో జాతివివక్షను అంతం చేయడంలో ప్రజా ప్రతిఘటనే కీలకమైనది. అమెరికాలో మహిళల హక్కులు, పౌరహక్కులు, కార్మిక హక్కులను సాధించింది. ఫిలిప్పీన్స్, చీలీ, ఇండోనేషియా, సెర్బియా తదితర ప్రాంతాల్లో నియంతృత్వాన్ని కూలదోసింది. డెన్మార్క్, తూర్పు తైమూరుల్లో విదేశీ దురాక్రమణను నిరోధించింది. భారతదేశంలో ఆంగ్ల పాలకుల నుంచి స్వతంత్రం సాధించడానికి ఉపయోగపడింది. తూర్పు యూరపులో అక్రమ ఎన్నికలను అడ్డుకుంది. లెబనాన్ లో సిరియా దురాక్రమణను అడ్డుకుంది. అనేక ప్రాంతాల్లో మానవహక్కులు, న్యాయం, ప్రజాస్వామిక స్వయం పాలనలు సాధించడానికి ప్రజా ప్రతిఘటనే కారణమైంది.


## మౌలికాంశాలు:


## ప్రజా ప్రతిఘటన వర్సెస్ నైతికమైన అహింస

ప్రజా ప్రతిఘటన అనేది ఒక రాజకీయ ఘర్షణ. నైతికమైన అహింస అనేది హింసను నిషేధించే నీతిసూత్రావళి. భారత స్వతంత్ర పోరాటం, అమెరికాలో పౌరహక్కుల ఉద్యమం వంటి కొన్ని విజయవంతమైన ప్రజా ప్రతిఘటనల్లో నైతికమైన అహింస బోధించడముంది. కాని ప్రజా ప్రతిఘటన ఉద్యమకారులు ఉద్యమ ప్రయోజనాల కోసమే అహింసకు కట్టుబడడం అవసరం. నైతికమైన అహింసాత్మక బోధనేది ఇందులో భాగంకాదు. నిజానికి చరిత్రలో ప్రజా ప్రతిఘటన ఉద్యమాల్లో అత్యధిక శాతం అహింసకు కట్టుబడడం అన్నది నైతికమైన సూత్రంగా చేయలేదు. అహింసాత్మక పోరాటం, ప్రతిఘటనలే తమ పోరాటానికి తగిన పద్ధతులుగా భావించి దానికి కట్టుబడ్డారు.

## కేంద్రీకృత వర్సెస్ వికేంద్రీకృత అధికారం

చాలా సమాజాల్లో అధికారమన్నది కేంద్రీకృతమైనదిగా భావిస్తారు. అంటే సాధారణ ప్రజలు తమ ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థల సానుభూతి, ప్రభుత్వనిర్ణయాలు, ప్రభుత్వ మద్దతుపై ఆధారపడి ఉంటారని భావిస్తారు. అధికారపు నిచ్చెనపై ఉన్న కొందరి చేతుల్లో మాత్రమే అధికారం ఉంటుందని అనుకుంటారు. ముఖ్యంగా హింసాకాండకు పాల్పడే సామర్థ్యం, సంపద ఉన్నవారివద్దనే అధికారముంటుందని భావిస్తారు. ఇలా కేంద్రీకృతమై ఉన్న




అధికారం స్వయం సమృద్ధి కలిగిందని, పటిష్టమైనదనీ, తేలిగ్గా మార్చడం సాధ్యపడదని అనుకుంటారు. కాని ప్రజా ప్రతిఘటన అనేది అనేక విషయాలపై ఆధారపడి ఉంటుంది. ప్రజా ప్రతిఘటన అనేది అధికారానికి సంబంధించిన వికేంద్రీకృత భావనపై ఆధారపడింది. దీని ప్రకారం ప్రభుత్వం కాని ప్రభుత్వ సంస్థలు కాని ప్రజల మద్దతుపై ఆధారపడి ఉంటాయి. ప్రజల సహాయంపై, ప్రజామద్దతుపై ఆధారపడి ఉంటాయి. సమాజంలోని విభిన్న సముదాయాలు అధికారానికి సహాయపడి ఆమోదిస్తేనే అధికారం కొనసాగుతుంది. ప్రజలు, అనేక సంస్థల

సహాయసహకారాల ద్వారా పునరుద్ధరణ పొందే సామర్థ్యంపై ఇది ఆధారపడి ఉంటుంది. ప్రజలు విస్తృత సంకీర్ణంలా ఏర్పడి ప్రభుత్వ కార్యకలాపాలను ఆటంకం కలిగించడం ద్వారా ప్రభుత్వ సామర్థ్యాన్ని దెబ్బతీయగలరన్నది ప్రజా ప్రతిఘటన పోరాటాల మౌలిక సూత్రం.

## క్రియాశీలక చర్యలు, సహాయనిరాకరణ:

చరిత్రలో ప్రజాప్రతిఘటన పోరాట యోధులు అనేక ఎత్తుగడలతో ఉద్యమాలు నడిపారు. ఈ ఎత్తుగడలను రెండు తరగతులుగా విభజించవచ్చు. ఇందులో సహాయనిరాకరణ ఒకటి. సాధారణంగా ఒక వ్యవస్థలో ప్రజలు చేయవలసిన పనులు చేయకుండా ఉండడమే సహాయనిరాకరణ. ఉదాహరణకు కార్మికుల స్ట్రయికులు, పన్నులు చెల్లించకపోవడం, ఉత్పత్తులను బహిష్కరించడం వంటివి. క్రియాశీలక చర్యలు రెండవ తరగతి. ప్రజలు ఒక వ్యవస్థలో చేయకూడని పనులు, నిషిద్ధమైన పనులకు పూనుకోవడం. ఉదాహరణకు భారీ ప్రదర్శనలు, నిరసనలు, బైఠాయింపులు ఇలాంటి అహింసాత్మక పోరాటాలు. ఈ ఎత్తుగడలను వ్యూహాత్మకంగా అమలు చేయడం వల్ల ప్రభుత్వానికి నియంత్రణ వ్యయం చాలా పెరిగిపోతుంది. యథాతథస్థితిని కొనసాగించాలంటే చాలా మూల్యం చెల్లించుకోవలసి ఉంటుంది. ప్రభుత్వ చర్యల వల్ల మరికొందరు ప్రజలు ప్రతిఘటనలో చేరడానికి ప్రేరణ లభించవచ్చు. ప్రజాప్రతిఘటనలో విభిన్నమైన పద్ధతులు ఉండొచ్చు. అందులో తక్కువ రిస్కు గలవి, ఎక్కువ రిస్కు గలవి ఉండొచ్చు. పబ్లిక్ పద్ధతులు ప్రయివేటు పద్ధతులు, కేంద్రీకృతమైనవి, వికేంద్రీకృతమైనవి ఉండొచ్చు. ఈ పద్ధతుల ద్వారా సమాజంలోని వివిధ వర్గాలకు చెందిన ప్రజలంతా ఉద్యమంలో పాల్గొంటారు.

## సమైక్యత, పథకరచన, అహింసాత్మక క్రమశిక్షణ

ప్రజాప్రతిఘటన విజయాలకు మూడు అంశాలు కీలకమైనవి. అవి సమైక్యత, పథక రచన, అహింసాత్మక క్రమశిక్షణ. సమాజంలోని వివిధ వర్గాల ప్రజలను సమీకరించడం ద్వారా సమైక్యత సాధించవలసి ఉంటుంది. సమాజంలో విభిన్న వర్గాల సాధకబాధలు వివిధ రీతుల్లో ఉండొచ్చు. వారందరినీ కూడగట్టుకుని, సాధించగలిగే లక్ష్యాల కోసం ఏకం చేయాలి. పథక రచన అన్నది ఉద్యమ కార్యకలాపాలను క్రమపద్ధతిలో కొనసాగించడం. చర్యలకు సంబంధించి పరిస్థితులు, అవకాశాలను చాలా జాగ్రత్తగా విశ్లేషించి తగిన పద్ధతుల్లో ఉద్యమకార్యకలాపాలను రూపొందించడం. నష్టాలను ముందే ఊహించడం,

ఎదురుదెబ్బలను ఊహించడం అవసరమైన ద్వితీయస్థాయి పథకాన్ని ముందుగా రూపొందించుకోవడం కూడా దీనిలో భాగమే. అహింసాత్మక క్రమశిక్షణ అంటే కేవలం అహింసాయుతమైన ఎత్తుగడలను, పద్ధతులను మాత్రమే ఉపయోగించాలని వ్యూహాత్మకంగా కట్టుబడడం. ఎందుకంటే హింస వల్ల సాధారణ ప్రజలు ఉద్యమంలో పాల్గొనే అవకాశాలు తగ్గిపోతాయి. అందువల్ల ఉద్యమం న్యాయబద్ధత దెబ్బతింటుంది. అంతర్జాతీయ మద్దతు తగ్గుతుంది. అలాగే ప్రత్యర్థి శిబిరం నుంచి ఫిరాయింపుల అవకాశాలు కూడా దెబ్బతింటాయి.

## పది ప్రశ్నలు:

## 1 . ప్రజాప్రతిఘటనను ఉపయోగించడం ద్వారా సాధారణ ప్రజలు బలమైన పాలకులను ఎలా ఓడించారు?

ఏ పాలకుడైనా తనకు తానే బలవంతుడు కాదు. సమాజంలోని లక్షలాది కోట్లాది ప్రజలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మద్దతు ఇస్తున్నప్పుడే పాలకుడు బలవంతుడు అవుతాడు. పాలకుడు తన నియంత్రణ కొనసాగించడానికి పోలీసు, సైన్యం, న్యాయవ్యవస్థ, పాలనావ్యవస్థ వంటివన్నీ తమ విధులను ఖచ్చితంగా నిర్వర్తించవలసి ఉంటుంది. సమాజంలో ప్రజలు క్రమం తప్పకుండా తమ పనులు చేస్తూ ఉండాలి. పన్నులు చెల్లిస్తూ ఉండాలి. మార్కెటులో వస్తువులు కొనాలి, వివిధ సేవలకు వినియోగదారులవ్వాలి. అందువల్ల ప్రభుత్వ నిర్వహణలో ఉండే అనేక వ్యవహారాలకు మద్దతు లభిస్తుంది. షిప్పింగ్, రవాణా రంగాల్లో పనిచేసే ప్రజలు, కమ్యునికేషన్ రంగంలో పనిచేసే ప్రజలు ఇలా వివిధ రంగాల్లో పనిచేసే ప్రజలు ఆయా పనులను కొనసాగిస్తూ ఉండాలి. ఒక ప్రభుత్వ వ్యవస్థ బలంగా ఉండాలంటే ఇలాంటి అనేక రంగాల్లో పనులు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగుతూ ఉండాలి.

ప్రజాప్రతిఘటన ఉద్యమం ఈ వాస్తవాన్ని అర్థం చేసుకుంటుంది. ఈ యథాతథస్థితిని కొనసాగించడం కష్టమయ్యే పరిస్థితిని సృష్టించడానికి, ప్రభుత్వ వ్యవస్థకు లభిస్తున్న ఈ సహాయాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తుంది. పెద్ద సంఖ్యలో ప్రజలను సహాయనిరాకరణకు సమీకరించడం, నిరసనలకు పూనుకునేలా చేయడం వల్ల పాలకుల పరిపాలన న్యాయబద్ధమైనది కాదని స్పష్టమైపోతుంది. తమ హక్కులు కోరుతున్న ప్రజలపై బలప్రయోగానికి పూనుకున్నప్పుడు ఆ వ్యవస్థ న్యాయబద్ధతను కోల్పోతుంది. ఈ విధంగా యథాతథస్థితిని కుదిపేయడం ద్వారా ప్రజా ప్రతిఘటన వ్యవస్థను దెబ్బతీస్తుంది.

యథాతథస్థితిని కొనసాగించడానికి, అదుపును కొనసాగించడానికి ప్రభుత్వం చేపట్టే చర్యల వ్యయం పెరిగిపోతుంది. ఈ వ్యయం అత్యధికంగా పెరిగినప్పుడు వ్యవస్థను సమర్థించేవారు కూడా దాని భవిష్యత్తును ప్రశ్నించడం ప్రారంభమవుతుంది. వారి విధేయత దెబ్బతినడం ప్రారంభమైతే ఇక దౌర్జన్యాలను అణిచివేతలను కొనసాగించడం కష్టమైపోతుంది.

## 2 . ప్రజాప్రతిఘటనలు ఎలా ప్రారంభమవుతాయి?

సాధారణ ప్రజల్లో చర్యలు చేపట్టే సామర్థ్యాన్ని కలిగించడం ద్వారానే చాలా ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. స్థానికమైన, తక్కువ రిస్కు కలిగిన ఎత్తుగడల ద్వారా ప్రజలను సమీకరించడం, సమైక్యతను సృష్టించడం అనేది చాలా ముఖ్యమైన విషయం. ఉదాహరణకు భారతదేశంలో గాంధీజీ తన మొదటి సహాయనిరాకరణ ఉద్యమం ప్రారంభించాడానికి ముందు ఆయన అనేక నెలలు, సంవత్సరాలు సాధారణ ప్రజలతో మాట్లాడుతూ, వారిని కలుసుకుంటూ గడిపారు. వారి కష్టనష్టాల గురించి తెలుసుకున్నారు. వారి ఆశలు, భయాల గురించి తెలుసుకున్నారు. వారి సహకారం, వారి మద్దతు పొందాలంటే ఏం చేయాలో తెలుసుకున్నారు. ఆయన ప్రజలను నిర్మాణాత్మక పనుల్లో పాల్గొనేలా ప్రోత్సహించేవారు. సమాజసేవ చేసేలా ప్రోత్సహించేవారు. ఆ విధంగా ప్రభుత్వం పట్ల విశ్వాసం కోల్పోయి, ఏమీ చేయలేని నిస్సహాయతలో ఉన్న ప్రజల్లో వారి సామర్థ్యం పట్ల నమ్మకాన్ని కలిగించారు.

చర్యలు చేపట్టే సామర్థ్యం ప్రజల్లో కలిగించిన తర్వాత ప్రత్యక్ష చర్యలకు పూనుకోవడం కనిపిస్తుంది. స్థానిక సమస్యలు, విస్తృతస్థాయిలో చర్చకు వచ్చే స్థానికసమస్యలపై ఆందోళన వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది. ఉదాహరణకు పోలెండ్ లో ఒక షిప్పింగ్ యార్డులో కార్మిక సమ్మె ద్వారా సాలిడారిటీ ఉద్యమం ప్రారంభమైంది. ఒక సమస్యలో విజయం సాధించిన తర్వాత, ఒక స్వతంత్ర ట్రేడ్ యూనియన్ స్థాపించుకున్న తర్వాత పోలెండ్ ప్రజల్లో ఆత్మవిశ్వాసం అనేకరెట్లు పెరిగింది. దేశవ్యాప్తంగా పోలెండ్ ప్రజలందరిలోను ఈ ఆత్మవిశ్వాసం పెరిగింది. ఉద్యమానికి గొప్ప బలం లభించింది. అదేవిధంగా అమెరికాలో దక్షిణ రాష్ట్రాల్లో కొన్ని పట్టణాల్లోని దుకాణాలు, బస్సుల్లో తెలుపు, నలుపు వివక్ష, వేర్పాటులను బైరాయింపులు, బహిష్కరణల వంటి చర్యలతో ఎదుర్కొని నిర్మూలించడం జరిగింది. ఈ విజయాలతో ఉద్యమం ఎంత బలమైనదో అందరికీ తెలిసింది. ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. జాతీయస్థాయిలో చర్చకు వచ్చింది. జాతీయస్థాయిలో ఉద్యమం సానుభూతిపరులను, కార్యకర్తలను సంపాదించుకుంది.

## 3 . ప్రతిఘటనలను నిర్వహించడం ఎలా?

ఒక ఉద్యమాన్ని నడిపేవారు, వ్యూహాత్మక పథక రచన చేసేవారు తమ లక్ష్యాలేమిటో, తమ బలాలేమిటో, బలహీనతలేమిటో, సామర్థ్యాలేమిటో తెలుసుకోవాలి. అలాగే ప్రత్యర్థి గురించి కూడా అవగాహన కలిగి ఉండాలి. బయటివారి నుంచి ఎలాంటి మద్దతు లభిస్తుందన్న అంచనా ఉండాలి. స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్ధారించుకున్న తర్వాత పరిస్థితుల గురించి క్షుణ్ణంగా సమీక్షించుకున్న తర్వాత, ఎలాంటి పద్ధతులు, ఎలాంటి ఎత్తుగడలు పాటించాలన్న స్పష్టత వస్తుంది. అప్పుడు ఆందోళనలు, భారీ ప్రదర్శనలు, నిరసనల రూపంలో ప్రతిఘటన ఉండాలని భావిస్తే, అలాంటి ఆందోళనలు విజయవంతంగా ఎలా నడపాలన్నది తెలుసుకోవాలి. దీనికి సంబంధించేన సాంకేతికమైన, వ్యూహాత్మకమైన వివరాలు అందించే అనేక మార్గాలున్నాయి.

## 4 . ప్రజా ప్రదర్శనలు కాకపోతే ఏం చేయాలి?

ప్రజా ప్రతిఘటన ఉద్యమాల్లో ప్రదర్శనలు, ఆందోళనలే ముఖ్యమని చాలా మంది భావిస్తారు. అనేక విభిన్నమైన ఎత్తుగడలు, పద్ధతుల్లో ప్రదర్శనలు ఒకటి మాత్రమే. ప్రజా ప్రతిఘటన పోరాటాల్లో అనేక పద్ధతులు పాటించడం జరుగుతుంది. దాదాపు రెండువందల అహింసాత్మక పోరాట పద్ధతులున్నాయి. అనేక విధాల బహిష్కరణలు (వస్తువులు బాయ్ కాట్ చేయడం, రాజకీయమైన, సామాజికమైన బహిష్కరణలు), స్ట్రయికులు, పనిలో మందగించడం, శిస్తులు, పన్నులు, ఫీజులు వగైరా చెల్లించడానికి తిరస్కరించడం, పిటీషన్లు, సహాయనిరాకరణ, బైఠాయింపులు, హర్తాళ్ళు, సమాంతర సంస్థలను ఏర్పాటు చేసుకోవడం వంటి అనేక పద్ధతులున్నాయి.

ఏ పద్ధతులు పాటించాలి. ఏఏ పద్ధతులు ఏ క్రమంలో పాటించాలన్నది ఆయా పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ఉద్యమం లక్ష్యాలు, సామర్థ్యాలపై ఆధారపడి ఉంటుంది. ఉద్యమం బలంగా లేనట్లయితే, వికేంద్రీకృత చర్యలు, తక్కువ రిస్కు చర్యలు అవలంబించవచ్చు. అంటే

బాయ్ కాట్లు చేయడం, లేదా తామెవరో తెలియకుండా ఉద్యమ చిహ్నాలను ప్రదర్శించడం వగైరా పద్ధతులున్నాయి. ఉద్యమం బలాన్ని పెంచడానికి ఉద్యమం గురించి సమాచారాన్ని ప్రజలందరి వద్దకు తీసుకువెళ్ళాలి. ప్రత్యర్థి శిబిరం కుదుపులకు గురయ్యేలా చేయాలి. ఉద్యమం బలపడితే అప్పుడు మరింత కేంద్రీకృతమైన చర్యలు చేపట్టవచ్చు. అంటే ర్యాలీలు, మార్చ్ లు, ప్రతిఘటన ప్రదర్శనలు, నిరసనలు వగైరా చేపట్టవచ్చు.

ప్రజా ప్రతిఘటన అంటే సాధారణంగా ప్రజలు నిరసన ప్రదర్శనలు, భారీ ర్యాలీలుగా భావిస్తారు కాబట్టి అవే గొప్ప పోరాట పద్ధతులని భావించరాదు. పరిస్థితులను బట్టి, ప్రజా ప్రదర్శన కన్నా మెరుగైన ఫలితాలు ఇచ్చే ఇతర పద్ధతులు కూడా ఉంటాయి. ఏ పద్ధతి పాటించాలన్నది నిర్ణయించడానికి సృజనాత్మకంగా ఆలోచించడం, వ్యూహాత్మకంగా ఆలోచించడం చాలా ముఖ్యం.

## 5. ఉద్యమంలో చరిష్మా ఉన్న నాయకుడు లేకపోతే ఎలా?

చరిష్మా ఉన్న నాయకుడు లేకుండానే చాలా ఉద్యమాలు చరిత్రలో గొప్ప ప్రజాప్రతిఘటన ఉద్యమాలుగా విజయాలు సాధించాయి. దక్షిణాఫ్రికాలో జాతివివక్ష వ్యతిరేక ఉద్యమం గొప్ప విజయాలు సాధిస్తున్నప్పుడు ఉద్యమ నాయకుడు జైల్లో, ఉద్యమానికి దూరంగా ఉన్నాడు. వ్యక్తిగత ఆకర్షణ, వాగ్ధాటిల కన్నా ప్రజా ప్రతిఘటన ఉద్యమాల్లో నాయకులు విభిన్న వర్గాలందరికీ ప్రాతినిధ్యం వహించే జ్ఞానం కలిగి ఉండడం ముఖ్యమైనది. అలాగే ప్రత్యామ్నాయ చర్యలకు చెల్లించవలసిన మూల్యం, అందులో ఉన్న రిస్కు వగైరాల గురించి పూర్తి అవగాహన కలిగి ఉండడం ఇంకా అవసరం. స్థానిక నాయకులతో నిర్ణయాధికారాన్ని పంచుకోవడం కూడా ఇంకా ముఖ్యం. చరిష్మా కలిగిన నాయకుడిపై ఆధారపడడంలో రిస్కు చాలా ఎక్కువ. అలాంటి నాయకుడు ఒక్కోసారి పాలకవర్గంతో చేతులు కలపవచ్చు. పాలకులు అలాంటి నాయకుడికి అధికారంలో భాగం ఇస్తామని ప్రలోభపెట్టి లొంగదీసుకోవచ్చు. లేదా అలాంటి నాయకుడిని జైల్లో పెట్టి ఉద్యమానికి దూరం చేయవచ్చు. దృఢమైన ఉద్యమాలు నాయకుడు దూరమైనా ముందుకు నడిచేలా నిర్మాణం కలిగి ఉంటాయి. కొత్త నాయకులను ఉద్యమం ముందుకు తీసుకువస్తుంది.

# 6 . మా దేశంలో ప్రజాప్రతిఘటన పనిచేయదని నేను అనుకుంటుంటే ఏం చేయాలి?

ప్రజా ప్రతిఘటన  ఎల్లప్పుడు విజయం సాధిస్తుందని చెప్పలేము. కాని ప్రపంచంలో అనేక దేశాల్లో విజయవంతం అయ్యింది. ప్రజా ప్రతిఘటనలకు అవకాశమే లేదని, పనిచేయవని భావించిన దేశాల్లోను విజయాలు సాధించింది. ప్రపంచంలోనే అత్యంత అమానుషమైన, క్రూరమైన నియంతగా పేరుపొందినవాడు చిలీ నియంత అగస్టో పినోషెట్. అలాంటి నియంతను పడగొట్టడానికి ప్రజా ప్రతిఘటన పనికొస్తుందని ఎవ్వరూ అనుకోలేదు. కాని అదే జరిగింది. అలాగే సెర్బియా నియంత స్లోబోడన్ మిలోసెవిక్, ''బాల్కన్ దేశాల కసాయి''గా పేరుపడిన క్రూరనియంతను కూడా అహింసాయుత ప్రతిఘటనతో గద్దెదించవచ్చని నిరూపణ అయ్యింది. సెర్బియాలో 2000 సంవత్సరంలో మిలోసెవిక్ గద్దె దిగాలని ప్రదర్శనలు చేస్తున్న వేలాది మంది సాధారణ ప్రజలను అణిచేయాలని మిలోసెవిక్ తన సైన్యానికి, పోలీసులకు ఆదేశాలు జారీ చేసినప్పుడు, తమ తోటి ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రదర్శన చేస్తున్నప్పుడు చూసిన సైన్యం, పోలీసులు ఆ ఆదేశాలను పాటించలేదు. గద్దె దిగడం తప్ప మిలోసెవిక్ కు మరో మార్గం మిగల్లేదు.

మీ పరిస్థితుల్లో, మీ ప్రాంతంలో ప్రజా ప్రతిఘటన పనిచేస్తుందో లేదో అన్న అనుమానాలు ఇంకా ఉంటే ఇతర సాధ్యమయ్యే ప్రత్యామ్నయాల గురించి ఆలోచించండి. రాజకీయవ్యవస్థను అందులో చేరి సంస్కరించే ప్రయత్నం చేయడం. ఎన్నికల్లో పాలు పంచుకోవడం. న్యాయవ్యవస్థకు పిటీషన్లు పంపడం. ప్రత్యర్థులతో చర్చలు సంప్రదింపుల్లో పాల్గొనడం. అంతర్జాతీయ సమాజానికి మద్దతు కోసం అప్పీలు చేయడం. సాయుధ తిరుగుబాటుకు పూనుకోవడం ఇవన్నీ ప్రత్యామ్నయాలే. ఈ పద్ధతులన్నీ ప్రపంచంలోని వివిధ దేశాల్లో చాలా మంది ఉపయోగించారు. ప్రజా ప్రతిఘటన విజయవంతం అవుతుందో లేదో అన్న అనుమానం ఉన్నట్లయితే, మరో పద్ధతిలో పోరాటం కూడా విజయం సాధిస్తుందో లేదో చెప్పలేము.

నియంతృత్వాన్ని వ్యతిరేకించే అసమ్మతి వర్గం చేయవలసింది ఎలాంటి చర్యలు చేపట్టాలన్న నిర్ణయం తీసుకోవడం. పెద్ద సంఖ్యలో సానుభూతిపరులను సంపాదించుకునేలా, దుర్మార్గపు వ్యవస్థ న్యాయబద్ధతను ప్రశ్నించేలా, అణిచివేతను తప్పించుకోవడం, లేదా నిర్వీర్యం చేయడం, నిరంకుశ వ్యవస్థను సమర్థించేవారిలో ఫిరాయింపులు సృష్టించడం వంటివి సాధించే చర్యలను ఎంచుకోవాలి. ప్రపంచ చరిత్రలో అనేక అసమ్మతి వర్గాలు ఈ ప్రత్యామ్నయాలను ఎంచుకున్నాయి. ప్రజా ప్రతిఘటన ద్వారా పోరాడాయి. కొన్ని సందర్భాల్లో ఎన్నికలు, న్యాయపరమైన పోరాటాలు, చర్చలు, వ్యవస్థను లోపలి నుంచి

సంస్కరించడం వంటి సంప్రదాయిక పద్ధతులతో పాటు ప్రజా ప్రతిఘటనను కొనసాగించడం కూడా జరిగింది.

## 7 . నిరంకుశ వ్యవస్థ హింసకు పాల్పడితే ఏం చేయాలి?

ఏదో ఒక దశలో వ్యవస్థ హింసకు పాల్పడుతుందన్నది ముందే ఊహించాలి. చరిత్రలో చూస్తే హింసకు పాల్పడడం అనేది ప్రతి సందర్భంలోను కనిపిస్తుంది. నిరంకుశ వ్యవస్థ హింసకు పాల్పడడమంటే ప్రజా ప్రతిఘటన ఓడిపోయినట్లు అర్థం కాదు. ప్రజా ప్రతిఘటన విభిన్న పద్ధతుల ద్వారా వ్యవస్థ హింసను ఎదుర్కొంటుంది. ఆ విధంగా హింస ప్రభావాన్ని తగ్గిస్తుంది. లేదా హింసాయుత చర్యలు నియంతలకు బెడిసికొట్టేలా చేస్తుంది.

మొదట, హింసాత్మక అణిచివేతను తప్పించుకోడానికి లేదా లేకుండా చూడ్డానికి ప్రజా ప్రతిఘటన ఉద్యమం అలాంటి ఎత్తుగడలను, అంటే హింసాయుతంగా అణచడానికి వీలుకాని పద్ధతులను ఎంచుకోవాలి. ఉదాహరణకు, వస్తువులను బహిష్కరించడం, ఉత్పత్తులను బాయ్ కాట్ చేయడం. అంటే ప్రజలు కొన్ని వస్తువులను, ఉత్పత్తులను కొనకూడదని నిర్ణయించుకుని బహిష్కరిస్తారు. ఇలాంటి చర్యలను వ్యవస్థ హింసతో అణిచేయడం సాధ్యం కాదు. ఎందుకంటే బహిష్కరణకు పూనుకున్న ప్రజలు ఎక్కడెక్కడో ఉంటారు, ఒక ప్రాంతంలో గుమికూడి చేయరు, చెప్పి చేయరు, ఎవరు ఏ వస్తువులను ఉత్పత్తులను బహిష్కరించే నిర్ణయంతో కొనడం లేదో నిర్ధారించడం వ్యవస్థకు సాధ్యం కాదు. కాబట్టి ఇలాంటి ప్రతిఘటనను హింసతో అణిచేయడం సాధ్యం కాదు. నిరసన ప్రదర్శనలు, లేదా అలాంటి ప్రజాందోళనల్లో ఒకే చోట కేంద్రీకృతంగా ప్రతిఘటన ఉంటుంది. అలాంటి వాటిని హింసతో అణిచేస్తే, కేంద్రీకృతంగా ఒకే చోట జరక్కుండా, భౌతికంగా ప్రతిఘటన కనబడకుండా, ఫీజులు, పన్నుల చెల్లించకుండా నిరసనను తెలియజేయవచ్చు. అలాగే ప్రజా ప్రతిఘటనల్లో రాజకీయేతర సాధారణ స్ట్రయికులు కూడా ఎత్తుగడగా వాడవచ్చు.

ప్రజా ప్రతిఘటన పోరాటం సృజనాత్మక ఎత్తుగడలను కూడా అవలంబించవచ్చు. ఆ విధంగా నిరంకుశ వ్యవస్థ అణిచివేత చర్యలు బెడిసికొట్టేలా చేయవచ్చు. అణిచివేతను ప్రపంచానికి చాటి చెప్పడం, అణిచివేత చర్యలను ప్రచారం చేయడం, దేశంలోని అణిచివేత ఫోటోలు, కథనాలను ప్రపంచానికి తెలిసేలా చేయడం వల్ల నిరంకుశ వ్యవస్థ అణిచివేతను కొనసాగించడం కష్టమవుతుంది. అంతర్జాతీయంగా వ్యవస్థ ప్రతిష్ఠ దెబ్బతింటుంది. పెట్టుబడులపై ప్రభావం పడుతుంది. అప్పుడు అణిచివేత అనేది నిరంకుశ వ్యవస్థకే ఎక్కువ నష్టం కలిగిస్తుంది. అయితే అణిచివేత చర్యలన్నీ నియంతలకు బెడిసికొడతాయని చెప్పలేము. కాని ప్రజా ఉద్యమం ద్వారా నిరంకుశ వ్యవస్థ అణిచివేత చర్యలను సంక్లిష్టంగా

మార్చేస్తే, అవాంఛనీయమైన అణిచివేతల స్వభావాన్ని ప్రపంచానికి చాటి చెబితే వ్యవస్థ ప్రతిష్ఠ దెబ్బతినడం, దేశంలోను, అంతర్జాతీయంగాను వ్యవస్థ మద్దతును కోల్పోవడం జరుగుతుంది.

ఫిలిప్పిన్స్ లో 1986లో, చిలీలో 1988లో, సెర్బియాలో 2000లో, ఉక్రెయిన్ లో 2004లో భద్రతాదళాలు వ్యవస్థ ఆదేశాలను తిరస్కరించాయి. అంటే ఉద్యమం పట్ల సానుభూతి చూపించాయి. ఈ ఫిరాయింపు తర్వాత వ్యవస్థకు అణిచివేత కొనసాగించే సామర్థ్యం మిగల్లేదు. ప్రజా ప్రతిఘటన ఉద్యమాలు ఉద్దేశ్యపూర్వకంగా, ఒక ప్రణాళిక ప్రకారం, సుదీర్ఘకాలంగా భద్రతాదళాలు, సైన్యం వ్యవస్థకు తిరగబడేలా, ఫిరాయించేలా చేసిన ప్రయత్నాలు దీని వెనుక ఉన్నాయి.

## 8 . నియంతలకు నచ్చచెప్పడం సాధ్యపడకపోతే ఏం చేయాలి?

ప్రజా ప్రతిఘటన విజయం సాధించాలంటే అణిచివేతలకు పాల్పడే నియంతలకు నచ్చచెప్పడం అవసరం లేదు. అయితే నిరంకుశ వ్యవస్థకు సమర్ధకులుగా ఉన్న కొందరి విశ్వాసాన్ని సంపాదించడానికి ప్రయత్నించడం అవసరం.

ప్రజా ప్రతిఘటన ఎందుకు విజయం సాధిస్తుందంటే, నిరంకుశ వ్యవస్థను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సమర్థించేలా వ్యవహరిస్తున్న వేలాది లక్షలాది వ్యక్తుల వ్యవహారశైలిని మార్చడం, వారిలో నమ్మకాలను ప్రభావితం చేయడం ద్వారా విజయం సాధిస్తుంది. నిరంకుశ వ్యవస్థకు బలమిచ్చే ఈ అంశాలను దెబ్బతీయగలిగితే ఇక నియంతకు నచ్చచెప్పడం చెప్పలేకపోవడం అనేది అంత ముఖ్యం కాదు. నియంత అధికారబలం తగ్గుతూ చివరకు తన చేతుల్లో అదుపు లేదని గ్రహించక తప్పనిస్థితి వస్తుంది. కాబట్టి తప్పనిసరిగా కొత్త అధికారవ్యవస్థ విషయానికి ఒప్పుకోక తప్పదు.

ఉదాహరణకు, దక్షిణ ఆఫ్రికాలో 1985లో జాతివివక్ష వ్యతిరేక ఉద్యమకారులు తెల్లవారి వ్యాపారాలను బాయ్ కాట్ చేశారు. దక్షిణాఫ్రికాలోని పోర్ట్ ఎలిజెబెత్ లో ఈ చర్య వల్ల వ్యాపారాలు తీవ్రంగా నష్టపోయాయి. చివరకు వ్యాపారులే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి విధానాలు మార్చాలని కోరారు. జాతివివక్ష వ్యతిరేక ఉద్యమం లక్ష్యాల గురించి నచ్చచెబితే ఈ వ్యాపారులు బహుశా ఒప్పుకొని ఉండేవారు కాదు. కాని ప్రభుత్వ దమన నీతికి మద్దతిచ్చే బదులు ఉద్యమం డిమాండ్లకు మద్దతివ్వడమే లాభకరమని అర్థమైన తర్వాత ఆ పని చేశారు.

## 9 . ఫలితాలకు చాలా కాలం పడుతుంది. అంత కాలం నిరీక్షించలేకపోతే ఏం చేయాలి?

ప్రజా ప్రతిఘటన ప్రభావం పడడానికి సుదీర్ఘకాలం అన్ని సందర్భాల్లోను అవసరం లేదు. సోలిడారిటీ ఉద్యమం ప్రారంభమైన తర్వాత పదేళ్ళకు కాని విజయం సాధించలేకపోయింది కాని, ఫిలిప్పిన్స్ లో క్రూరమైన నియంత ఫెర్డినాండో మార్కోస్ పై ప్రజా ప్రతిఘటన కేవలం కొన్నేళ్ళలోనే విజయం సాధించింది. ప్రజా ప్రతిఘటన ప్రభావమన్నది ఉద్యమం ఎంత సమైక్యంగా ఉంది, చర్యలు ఎంత వ్యూహాత్మకంగా ఉన్నాయన్న విషయంపై ఆధారపడుతుంది. ఎంతకాలంగా ఉద్యమం నడిచిందన్నది ముఖ్యం కాదు.

## 10. ఎలా విజయం సాధించాలి?

ప్రజల్లో సమైక్యత సాధిస్తే, పకడ్బందీ ప్రణాళికలు ఉంటే, అహింసాయుత క్రమశిక్షణకు కట్టుబడితే ప్రజా ప్రతిఘటన గెలుపు సాధిస్తుంది.

సమైక్యత అన్నది చాలా ముఖ్యమైనది. ఎందుకంటే ప్రజల్లో అత్యధిక సంఖ్యాకుల అభిప్రాయాలు, నిబద్దతలకు ఉద్యమం ప్రాతినిధ్యం వహించినప్పుడే అది బలమైన ఉద్యమంగా మారుతుంది. ఒక ఉద్యమంలో ఎవరైనా పాల్గొనడం అన్నది స్వచ్ఛందంగా జరుగుతుందని గుర్తుంచుకోవాలి. ప్రజలు ఉద్యమంలో పాల్గొని ప్రమాదాలను కూడా ఎందుకు భరిస్తారంటే వారికి ఉద్యమం పట్ల విశ్వాసం ఉంది కాబట్టి. కాని సమైక్యత లేనట్లయితే, లక్ష్యం స్పష్టంగా లేనట్లయతే, అనుమానాలుంటే చాలా మంది ఉద్యమానికి దూరంగానే ఉండిపోతారు. క్లుప్తంగా చెప్పాలంటే విజయాలు సాధించిన ప్రజాపోరాటాల్లో ప్రజలంతా, స్త్రీలు, పురుషులు, పిల్లలు, వృద్ధులు, వివిధ మతస్తులు, వివిధ జాతులవారు, వివిధ వర్గాలవారు, విద్యార్థులు, కార్మికులు, మేధావులు, వ్యాపారవర్గం అందరూ పాల్గొన్నారు.

పథకరచన అనేది చాలా ముఖ్యం. ఎందుకంటే నిరంకుశ వ్యవస్థకు ప్రజాపోరాటానికి మధ్య పోటీ ఉంటుంది. ఇలాంటి పోటీలో వ్యవస్థీకృత ప్రయత్నాలు, వ్యూహాలు ఎంతో అవసరం. ఆ విధంగా ఉద్యమబలాలను అవసరమైన విధంగా వాడడం జరగాలి. ప్రజా పోరాటాల్లో నాయకులు అనేక వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యమానికి అవసరమైన వనరులను సముపార్జించడం, వాటిని అత్యుత్తమంగా ఉపయోగించడం, శత్రువు బలహీనతలను వాడుకోవడం, ప్రతిచర్యలను ఎదుర్కోవడం వగైరాలకు సంబంధించి నిర్ణక్షు

తీసుకుంటారు. ఉత్తమమైన నిర్ణయాలేవీ అప్పటికప్పుడు జరగవు. మంచి ప్రణాళికకు రెండువిధాలైన జ్ఞానం అవసరం. వ్యూహరచన చేసేవారికి తాము ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులకు సంబంధించిన లోతయిన అవగాహన ఉండాలి. సమాజంలో విభిన్న వర్గాల అవసరాలు, ఆకాంక్షల గురించి అవగాహన ఉండాలి. రెండవ జ్ఞానం, వ్యూహకర్తలు ప్రజా ప్రతిఘటన ఎలా పనిచేస్తుందో పరిజ్ఞానం ఉండాలి. ఇది వ్యక్తిగత అనుభవాల ద్వారా నేర్చుకోవచ్చు. పుస్తకాలు, సినిమాలు, ఇంటర్నెట్, ప్రజా ప్రతిఘటనలో అనుభవం ఉన్న వారితో మాట్లాడడం వంటి వాటి ద్వారా తెలుసుకోవచ్చు.

అహింసాత్మక క్రమశిక్షణ అనేది చాలా ముఖ్యమైనది. ఎందుకంటే ఒక ఉద్యమంలో హింస వల్ల ప్రజా ప్రతిఘటన ప్రభావం తగ్గిపోతుంది. వ్యవస్థ పాల్పడే అణిచివేతలను సమర్థించే సాకుగా మారిపోతుంది. అంతేకాదు, ఒక ప్రజా ప్రతిఘటన హింసకు పాల్పడితే అందులో పాల్గొనే ప్రజలు కూడా దూరమైపోతారు. హింసకు సంబంధించిన రిస్కును తీసుకోవడానికి సమాజంలో చాలా మంది సిద్ధపడరు. చివరిగా, ఒక ఉద్యమం పోలీసులపై లేదా సైన్యంపై హింసాకు పాల్పడడం జరిగితే అప్పుడిక నిరంకుశ వ్యవస్థకు విధేయులైన వారిలో మార్పును సాధించడం, వారు ఫిరాయించేలా చేయడం అన్నది అసాధ్యమైపోతుంది. వ్యవస్థను సమర్థించేవారిలో కనీసం కొందరిలో అయినా ఉద్యమం పట్ల ఉన్న కొద్దిపాటి సానుభూతి కూడా హింస వల్ల ఆవిరైపోతుంది. ఇది ప్రజా ప్రతిఘటనల గతిశీల స్వభావానికి పూర్తి వ్యతిరేకమైనది. ప్రజా ప్రతిఘటన లోని గతిశీలమైన స్వభావం దాని లక్ష్యం, ఒక స్వేచ్ఛాయుతమైన, మెరుగైన సమాజం, అందరికీ ప్రయోజనకరమైన సమాజం. అలాగే ఉద్యమం చేపట్టే అహింసాత్మక చర్యల్లో సాధారణ ప్రజల ధైర్యసాహసాలు నిరంకుశ వ్యవస్థను సమర్థించేవారి సానుభూతిని కూడా సంపాదించుకుంటాయి.

## కొటేషన్లు:

''దక్షిణాఫ్రికాలో మార్పును సాధించింది ప్రజా ప్రతిఘటనే. .. రాజ్యంపై ఒత్తిడి పెంచింది. చివరకు మారేలా చేసింది. రాజ్యం ప్రతిస్పందించడానికి అవకాశాలు కూడా లేని స్టేల్ మేట్ దశ వచ్చేలా చేసింది.'' – డా. జానెట్ చెర్రీ

''సంఘర్షణలో ముఖ్యమైన విషయమేమంటే అటెన్షన్ సాధించడం. ఏక్కడో మూల, ఎవరి దృష్టిలో పడని చోట సంఘర్షించడం వృథా. సంఘర్షణకు పూనుకోవాలంటే, మీ లక్ష్యం పట్ల ఎంత ఎక్కువమంది ప్రజల్లో ఆసక్తి కలిగించగలరో అంతమంది దృష్టిలో పడాలి.'' – ఎం.కే. హూసేలీ జాక్

''అహింసాయుత ప్రయత్నాల్లో సమస్య ఏమిటంటే, ఇందులో ఉన్నవారు శిలాసదృశ క్రమశిక్షణ, శిక్షణ, వ్యూహాత్మకత, పథకరచన, రిక్రూట్ మెంట్, ఉద్యమానికి అవసరమైన పనులు చేయడం మొదలైన వాటి  ప్రాముఖ్యాన్ని పట్టించుకోరు. ఇవన్నీ అప్పటికప్పుడు జరగవు. ఒక పద్ధతి ప్రకారం చేయవలసి ఉంటుంది.'' – రెవరెండ్ జేమ్స్ లాసన్

''అందుకే అణిచివేత ఎల్లప్పుడు బెడిసికొడుతుంది. ఎందుకంటే ఇది న్యూటన్ మూడోసూత్రంలా చర్యకు ప్రతిచర్య వంటిది. అణిచివేతను పెంచితే ప్రతిఘటన కూడా పెరుగుతుంది.'' – ఇవాన్ మారోవిక్